క్లుప్తంగా

ఇద్దరికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: జెడ్పీ యాజమాన్య పరిధిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ అనారోగ్య కారణాల వల్ల మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులు ఇద్దరికి ఆఫీసు సబార్డినేట్ పోస్టులలో నియమిస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ యాజమాన్య పరిధిలో ఉన్న పాఠశాలలు, మండల పరిషత్‌లలో ఖాళీలు ఏర్పడగానే ఎప్పటికప్పుడు దరఖాస్తుల నిబంధనలకు అనుగుణంగా కారుణ్య నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల వల్ల ఈ నెల 14వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం తెలిపారు. ఈ ఉపకేంద్రం పరిధిలోని ముత్తానగర్, గోళీలపేట, వలందపేట, తుపాను బిల్డింగ్, పోర్ట్ కాలనీ, జె.రామారావుపేట, కోమలివారి వీధి, జమ్మిచెట్టు సెంటర్, చిన్న మార్కెట్, ఏసువారి వీధి, ఓల్డ్ జగన్నాథపురం బ్రిడ్జి, మున్సిఫ్ జంక్షన్, ఎంఎస్ఎన్ చారిటీస్, చర్చిస్క్వేర్, పురంవారి వీధి, తూరంగి, మహాలక్ష్మినగర్, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

కిడ్నీ వ్యాధులతో అప్రమత్తం

కాకినాడ రూరల్: కిడ్నీ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సానా ప్రవీణ్ కోరారు. ప్రపంచ కిడ్నీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆయన కిడ్నీ వ్యాధులపై జాగ్రత్తలు తెలియజేశారు. ఏదైనా కారణం చేత కిడ్నీలు దెబ్బతింటే అశ్రద్ధ చేయకుండా తగిన వైద్యం పొందాలని కోరారు. కార్యక్రమంలో డాక్టరు అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీ జయంతి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30కు 108 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, అష్టోత్తర శత శ్రీసూక్త ఆజ్య సమిస్ర పద్మ హవనం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు కళ్లజోళ్ల పంపిణీ

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ కాకినాడ హాల్లో గురువారం బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐగ్లాస్ ప్రాజెక్టు ద్వారా 90 మంది పేదలకు కళ్లజోళ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ మెట్టా రాధా సరస్వతి వాటిని అందజేసి మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ప్రాజెక్టు ద్వారా కొన్ని వేల మందికి సేవలు అందిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ జీఎల్ జగన్నాథరావు, డి.రామసుబ్రమ్మణ్యం, పులవర్తి కుమార్, శ్రీనివాస్, జరీనా పాల్గొన్నారు.

విద్యా ప్రకాశానందగిరి జయంతి వేడుకలు

బోట్‌క్లబ్: స్వామి విద్యాప్రకాశనందగిరి 111వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక భోగిగణపతి పీఠంలో ఆయన చిత్రపటానికి గురుపూజ నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ సరస్వతీ కటాక్షం సిద్ధించిన విద్యాప్రకాశనంద ధన కనక వస్తు వాహన విలాస జీవితాలను ఆశించకుండా సద్బ్రహ్మచారిగా శ్రీకాళహస్తిలో శుక్రబ్రహ్మ ఆశ్రమాన్ని స్థాపించారన్నారు. బహుభాషా కోవిదుడిగా టీటీడీ ఆస్థాన ఆధ్యాత్మిక గురువుగా రెండు దశాబ్దాలపాటు భగవద్గీత సారాంశాన్ని పామరులకు అర్థం అయ్యే రీతిలో దేశ విదేశాల్లో ప్రవచనాలును అందించిన మహనీయుడన్నారు. మూడు ప్రభుత్వ కళాశాలలను, భక్త కన్నప్ప పేరిట ఉచిత కంటి వైద్య ఆస్పత్రిని ఏర్పాటు చేసి ఎంతో సేవలందించారన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

పెద్దాపురం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.సరిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించడం నేరమన్నారు.

పరీక్షలకు పది సూత్రాలు

- అమలు చేస్తే ఉత్తమ ఫలితాలు
- వ్యక్తిత్వ వికాస నిపుణుల సూచనలు



పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా సమయం దగ్గరయ్యే కొద్దీ విద్యార్థుల్లో భయం, తల్లిదండ్రుల్లో ఆందోళన తారాస్థాయికి చేరుతోంది. ఆ రెండో వీడితే విద్యార్థులకు విజయం తథ్యమని విద్యావేత్తలు, వ్యక్తిత్వ నిపుణులు చెప్తున్నారు.

'నిరంతర సాధన, గుండెలో ధైర్యం, మీ మీద మీకు ఉండే నమ్మకమే మిమ్మల్ని విజయ తీరాలకు నడిపిస్తుంది' ఇది యువతకు స్వామి వివేకానంద ఉపదేశించిన మంత్రం.

1. భగవద్గీతలో కర్మలను ఆచరించుటే కానీ ఫలితంపై నీకు అధికారం లేదు అన్న శ్లోకాన్ని దృష్టిలో పెట్టుకునిన రాయాల్సిన పరీక్షలపై దృష్టి పెడితే ఫలితం దానంతట అదే వస్తుంది.
2. భయం వల్ల టెన్షన్ వస్తుంది. దాని వల్ల తప్పులు జరుగుతాయి. రోజూ పది నిమిషాలు ధ్యానం లేదా పూజ చేయడం మంచిది.
3. ఫలితం ఎలా ఉన్నా ఫర్వాలేదనుకున్నప్పుడు భయం ఉండదు. చదివిన ప్రశ్నలు ప్రశ్నాపత్రంలో రావేమో...? చదవింది గుర్తుకు రాదేమో? లాంటి ఆలోచనలు భయాన్ని కలిగిస్తాయి. గంటల తరబడి చదవడం, ప్రణాళిక లేకపోవడం వంటివి దీనికి కారణం. ప్రతి గంటకూ కాస్త విరామం ఉండాలి. ఎంత చదివామన్నది ముఖ్యం కాదు. ఎలా చదివామన్నది ముఖ్యం. అందుకే ఒక ప్రణాళికతో చదవాలి.
4. చదువుల్లో పడి కొందరు విద్యార్థులు ఆహారం తీసుకోరు. ఇది మంచిది కాదు. మంచి నీరు ఎక్కువగా తాగాలి. రోజూ కొబ్బరి బొండం నీరు తాగితే మంచిది. కాఫీ, టీలు తగ్గించి మజ్జిగ, పళ్లరసాలు, బలమైన ఆహారం తీసుకోవాలి. సరైన మోతాదులో నిద్ర అవసరం. పరీక్షల సమయంలో రాత్రి పది తర్వాత చదవడం వల్ల ఉపయోగం ఉండదు. వేకువజామున లేచి చదివితే మంచిది.
5. పరీక్షల సమయంలో మేడపై చదవడం, ఫ్రెండ్స్ దగ్గరికి నోట్సులకని, బుక్స్‌కని వెళ్లి ఎండలో తిరగవద్ద. కొత్త విషయాలు నేర్చుకునే ప్రయత్నం వద్దు. కేవలం ఇప్పుడు రివిజన్ మాత్రమే చేయాలి. ఇది వరకు చదవని ప్రశ్నలు (మరీ ముఖ్యమైనవి అయితే తప్ప) నేర్చుకునే ప్రయత్నం చేయవద్దు.
6. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ వదిలేయాలి. ఫ్రెండ్స్‌తో చర్చవద్దు. పరీక్షల గురించి, నేర్చుకున్న ప్రశ్నల గురించి మాట్లాడవద్దు. గడిచిన పరీక్ష గురించి ఇంటికి వచ్చి చర్చించవద్దు. అలా చేయడం వల్ల మరుసటి రోజు పరీక్షపై ప్రభావం పడుతుంది.
7. పరీక్షకు అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరండి. దారిలో, ప్రయాణంలో చదవడం వద్దు. పరీక్ష హాలులోకి వెళ్లే ముందు చివరి ప్రయత్నంగా ఓ సారి పుస్తకం తీద్దామనే అలోచన వద్దు. పరీక్షా కేంద్రానికి వాటర్‌బాటిల్ తీసుకెళ్లండి. బిగుతైన దుస్తులు ధరించవద్దు.
8. ఇన్విజిలేటర్‌తో తప్ప పరీక్ష హాలులో ఎవరితోనూ మాట్లాడవద్దు. తలపక్కకి తిప్పి ఎవరు ఎన్ని అడిషనల్ షీట్లు రాస్తున్నారన్నది పట్టించుకోవద్దు. అది మీలో ఆందోళన పెంచుతుంది. బాగా రాయగలిగే ప్రశ్నను మొదట రాయాలి. దిద్దుబాట్లు వద్దు. టైం అయ్యే వరకు పరీక్ష హాలు వదిలి రావద్దు. ఒకటికి రెండుసార్లు హాల్‌టిక్కెట్ నంబర్ సరి చూసుకోవాలి.
9. పరీక్ష రాసిన వెంటనే ఇంటికి వచ్చేయాలి. ఫలానా ప్రశ్నకు సమాధానం సరైనదే రాశానా అనే చర్చలు వద్దు.
10. మామూలు రోజుల్లో ఏలా ఉంటారో పరీక్షలపుడు కూడా అలాగే ప్రశాంతంగా ఉండి పరీక్షలు రాయాలి. తల్లిదండ్రులు పిల్లలను విసుక్కోవడం, పరీక్ష రాస్తున్న పిల్లలను ఫంక్షన్లకు తీసుకెళ్లడం మంచిది కాదు. ఇతర విద్యార్థులతో అస్సలు పోల్చవద్దు.

ఆహార అలవాట్లతో అప్రమత్తం



పరీక్షలకు వెళ్లే మూడు గంటల ముందు కొబ్బరి నీళ్లు తాగాలి. తేనె, నిమ్మరసం, వేడి గంజి వీటిలో ఏదైనా మంచిదే. దీని వల్ల శక్తి వస్తుంది. బయట ఆహారం తినకూడదు. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిది. మొలకలు, క్యారెట్, కీరా వంటివి తీసుకోవడం వల్ల మేలు కలుగుతుంది. ఇవి శరీరానికి ఉత్తేజాన్నిస్తాయి.

– డాక్టర్ పృథ్వీ చరణ్, హెల్త్ ఆఫీసర్, కాకినాడ కార్పొరేషన్

భయం, ఒత్తిడి లేకుండా..



పరీక్ష రోజు వేకువనే నిద్రలేచి ప్రశాంతంగా కొంత సేపు కూర్చుని ప్రాణాయామం చేయాలి. పరీక్ష రోజున దేవాలయాలకు వెళ్లి గందరగోళానికి గురికావద్దు. మంచి పనికి దేవుని దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయి. పరీక్షలకు తీసుకు వెళ్లాల్సిన వస్తువులు హాల్ టికెట్, రెండు మంచి పెన్నులు, పెన్సిల్, రబ్బరు ముందుగా సిద్ధం చేసుకోవాలి.

– సుంకర మూర్తి, సబ్జెక్ట్ నిపుణులు, కాకినాడ

పునశ్చరణకే ప్రాధాన్యం



కొత్తవి చదివేకంటే పునశ్చరణకే ప్రాధాన్యమివ్వాలి. పాఠ్యాంశాల్లో ముఖ్యమైన అంశాలను చదవాలి. అన్ని సబ్జెక్టులకు నిర్దేశిత సమయంతో కూడిన ప్రణాళిక రూపొందించుకోవాలి. పరీక్షల సమయం వరకు పాఠశాలకు రావడం మంచిది. ఇంటి దగ్గర పరిస్థితి కన్నా తరగతుల్లో పోటీతత్వం ఉంటుంది. పరీక్షల రోజుల్లో సెల్‌ఫోన్లకు విశ్రాంతి ఇవ్వడం మరచిపోవద్దు.

– పి.రమేష్, విద్యాశాఖ అధికారి, కాకినాడ జిల్లా

సైన్స్ క్విజ్ విజేతలకు నగదు ప్రోత్సాహకం



విజేతలకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ క్విజ్ విజేతలకు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావురావు గురువారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ప్రభుత్వరంగ సంస్థ బిస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్) గతనెల పాఠశాల విద్యార్థులకు సైన్స్ క్విజ్ నిర్వహించింది. ఈ పోటీలో ప్రతిభ చూపిన ఎ.మేఘన, జి.జయశ్రీలకు ఒక్కొక్కరికి రూ.750 వంతున, బి.అపర్ణ గాయత్రి, ఎస్.కావ్యలకు ఒక్కొక్కరికి రూ.500 వంతున గెలుచుకున్నారు. వీరికి స్టాండర్స్ క్లబ్ సభ్యుడు, హిందీ ఉపాధ్యాయుడు మెహబూబ్ అలీ షేక్‌తో కల్సి హెచ్ఎం శ్రీనివాసరావు విద్యార్థులకు నగదును అందజేశారు. స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి, ఎస్.ప్రసాద్‌కుమార్, వి.రామమోహన్, కె.శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ 23వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ప్రజా చైతన్య యాత్ర డిమాండ్ చేసింది. గురువారం రాత్రి సీపీఎం బృందం డివిజన్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. దోమలతో ఇబ్బంది పడుతున్నామని, విద్యుత్ అంతరాయాలు, పార్కు అభివృద్ధి తదితర సమస్యలపై వారు గళమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, సభ్యులు మలక వెంకటరమణ, కే సత్తిరాజు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కవలల చదువుకు ఆర్థిక సాయం



కవలలకు నగదు, వస్త్రాలు అందజేస్తున్న శ్రీనివాస్, చిత్రంలో సతీష్, బాలికల తల్లి గంగాభవాని

కాకినాడ క్రైం: తండ్రిని కోల్పోయిన కవలల చదువుకు శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా సోదరుడు దాడిశెట్టి శ్రీనివాస్ చేయూత నిచ్చారు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన కొప్పిశెట్టి వీరబాబు 2021లో కోవిడ్‌తో 2021లో మృతి చెందారు. ఆ సమయానికి వీరబాబు భార్య గంగా భవాని నిండు గర్భిణి. అనంతరం ఆమె కవలలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని శ్రీయువసేన వ్యవస్థాపకుడు బొల్లం సతీష్ ద్వారా తెలుసుకున్న దాడిశెట్టి శ్రీనివాస్ ఈ మేరకు వారి చదువుకు తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. మాట ప్రకారం కవలు ఆరాధ్య, అర్పణల పూర్తి చదువు బాధ్యత తీసుకుంటున్నట్లు గురువారం సంస్థ కార్యాలయంలో ప్రకటించి వారి ప్రాథమిక విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చుతో పాటు నూతన వస్త్రాలు అందించారు.

పాఠశాల స్థాయిలోనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

- ఆర్‌జేడీ నాగమణి
- ఉపాధ్యాయుడి వితరణతో జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు



గాంధీ మహాత్ముని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

కరప: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో సాధన చేయాలని ఆర్‌జేడీ జి.నాగమణి పేర్కొన్నారు. మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు రూ.70 వేలతో సమకూర్చిన జాతీయ నాయకుల విగ్రహాలను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయుడి స్థాయి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్, శాస్త్రవేత్త నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన భారతరత్న అబ్దుల్ కలాం జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు హెచ్ఎం ఎ.సాయిమోహన్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాదరావు ఏటా ఒకనెల జీతాన్ని సేవా కార్యక్రమాలకు వెచ్చించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులతో కలసి గాంధీమహాత్ముని విగ్రహాన్ని ఆర్‌జేడీ నాగమణి, రాధాకృష్ణన్ విగ్రహాన్ని పబ్బినీడి పాపారావు, భారతరత్న అబ్దుల్ కలాం విగ్రహాన్ని పబ్బినీడి వెంకటకృష్ణ, కర్నాసుల పుష్పరాజ్ ఆవిష్కరించారు. తర్వాత యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు 76 మంది పదో తరగతి విద్యార్థులకు ఆర్‌జేడీ అందజేశారు. ప్రసాదరావును పాఠశాల తరఫున ఆర్‌జేడీ, ఎంఈఓలు సత్కరించారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ వై.వీరవేణి, ఎస్ఎంసీ చైర్మన్ పి.నూకరాజు, డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ విధులు అత్యంత కీలకం

- తేడా వస్తే రోగి చికిత్సా విధానంపై ప్రభావం
- జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి
- ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే



ల్యాబ్ టెక్నీషియన్స్ డేలో పాల్గొన్న అతిథి డాక్టర్ లావణ్యకుమారి, హెచ్‌వోడీలు, ఎల్‌టీలు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్ ఎదురుగా ఉన్న పాథాలజీ విభాగం లెక్చర్ గ్యాలరీలో వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్స్ డే ఘనంగా నిర్వహించారు. రంగరాయ వైద్య కళాశాలకు చెందిన, జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ల విధి నిర్వహణ అత్యంత ఏకాగ్రతతో కూడుకున్నదని అన్నారు. వైద్య నివేదికలో ఒక్క అంకె తప్పుగా వేసినా యావత్ రోగి ఆరోగ్య స్థితిగతులతో పాటు చికిత్సా విధానం సమూలంగా మారిపోతుందన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు వృద్ధి చెందుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని వృత్తి పరమైన అభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులకు నిరాటంక వైద్య సేవలు అందించడంలో సకాలంలో నివేదికలు అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతైనా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ప్రసన్నకుమార్, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ భాగ్యలక్ష్మి, పాథాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాజేశ్వరితో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విశ్రాంత ల్యాబ్ టెక్నీషియన్లను సత్కరించారు.

మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించండి

కాకినాడ క్రైం: ఈ నెల 3వ తేదీన జై బాలాజీ ట్రాన్స్‌పోర్టులో పార్సిల్ పేలుడు ఘటనలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన గజ్జెల మద్దిలేటి కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని కాకినాడ పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు, గురువారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యజమాని మృతితో ఆ కుటుంబంలోని ముగ్గురు పిల్లలు, భార్య రోడ్డున పడ్డారని, పిల్లలకు ఒకొక్కరికి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.30 లక్షలు యాజమాన్యం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని అన్నారు. అతడి భార్య చిన్నికి ప్రభుత్వం ఇంటి స్థలాన్ని మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన ట్రాన్స్‌పోర్టు యాజమాన్యం, వాటిని బుక్ చేసిన సంస్థల ప్రతినిధులపై ఎటువంటి చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. కోర్టు ఈ కేసును సుమోటాగా స్వీకరించి విచారణ జరపాలని అభ్యర్థించారు.

శివాలయంలో సొత్తు చోరీ

కాకినాడ క్రైం: కాకినాడలోని యానం రోడ్డులో ఉన్న బసవయ్య ఆయుర్వేదం సమీపంలో నూతనంగా నిర్మితమవుతున్న శివాలయంలో చోరీ జరిగింది. బుధవారం సాయంత్రం దేవాలయంలో భక్తులు ఇచ్చిన రూ.3.5 లక్షల విరాళాల మొత్తం భద్ర పరిచిన ఓ బ్యాగ్‌ను గుర్తు తెలియని ఆగంతకుడు దొంగిలించాడు. ఈ ఘటనపై ఆలయ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రరావు గురువారం రాత్రి కాకినాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిరుపేదలకు అండగా ప్రజా విద్యాలయం



రూ.లక్ష విరాళం అందజేస్తున్న సత్రం ట్రస్టీలు

బోట్‌క్లబ్: ప్రజా విద్యాలయంలో ఉచిత విద్యను అందించడం అభినందనీయమని ముత్తా రామన్న సత్రం వ్యవస్థాపక ట్రస్టీలు డాక్టర్ ముత్తా వెంకటేష్, ముత్తా ప్రసాద్‌బాబు అన్నారు. నిరుపేదలకు ఉచిత విద్య అందిస్తున్న ప్రజా విద్యాలయానికి సత్రం తరఫున సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం రూ.లక్ష విరాళం అందించారు. ప్రజా విద్యాలయం నిర్వహణ బాగుందని, ఉచితంగా విద్యను అందించడం గొప్ప విషయమన్నారు. అంతే కాకుండా సంగీతం, చిత్రలేఖనం, టైలరింగ్ నేర్పించడం గొప్ప విషయమన్నారు. ప్రజా విద్యాలయానికి ఆర్థిక సాయం చేసిన సత్రం ట్రస్టీలు ముత్తా వెంకటేష్, ముత్తా ప్రసాద్‌బాబులకు ప్రజా విద్యాలయం కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు నారాయణం మురళి, ప్రజా విద్యాలయం కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, సభ్యులు దొరయ్య చౌదరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీ, ఈబీసీలకు సబ్సిడీ రుణాలు

సామర్లకోట: కుల వృత్తులు చేసుకునే బీసీ కులాల వారికి ఆర్థికంగా వెనుకబడిన వారికి సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన్నట్లు ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి గురువారం సాయత్రం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలలో డి ఫార్మసీ చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలను బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా బుట్టలు, కుండలు వంటి చేతి వృత్తి చేసుకునే బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన ఆర్య వైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ కులాలకు చెందిన వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందుతాయన్నారు. అలాగే కాపు, ఒంటరి, తెలగ, బలిజ కులాలకు చెందిన వారికి రుణాలు ఇవ్వడానికి నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22 తేదీ లోపుగా ఆన్‌లైన్‌లో విద్యార్హత సర్టిఫికేట్లు, కుల, ఆధాయం సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి కులధృవీకరణ పత్రాలతో పాటు ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సచివాలయం నుంచి పొందాల్సి ఉంటుందన్నారు.

సీసీ కెమెరాల వితరణ



ఎస్పీ బిందుమాధవ్‌కు సీసీ కెమెరాలు అందజేస్తున్న నారాయణం మురళి

కాకినాడ క్రైం: స్థానిక సూర్యారావు పేటకు చెందిన సంస్థ ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ పారిశ్రామికవేత్త నారాయణం మురళి జిల్లా పోలీస్ శాఖకు సీసీ కెమెరాలు సమకూర్చారు. ఎస్పీ బిందుమాధవ్‌కు కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో రూ.1.2 లక్షలు విలువైన 12 సీసీ కెమెరాలు, అనుబంధ సాంకేతిక పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, సర్పవరం సీఐ పెద్దిరాజు, ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ ఈడీ శశిర్, హెచ్ఆర్ పీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా ఉండూరు సంపద కేంద్రం

పెదపూడి ఎంపీడీఓ నరేంద్రరెడ్డి



వర్మీ కంపోస్టు యూనిట్లపై శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

సామర్లకోట: ఉండూరు గ్రామంలో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శులు ఆదర్శంగా తీసుకోవాలని పెదపూడి ఎంపీడీఓ నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా పెదపూడి, గొల్లప్రోలు మండలాలలోని పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు మండలంలోని ఉండూరు వర్మీ కంపోస్టు యూనిట్‌లో గురువారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. నరేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రతి గ్రామంలో వర్మీ కంపోస్టు యూనిట్ మంచి సంపద తయారీ యూనిట్‌గా గుర్తింపు పొందడంతో నాలుగేళ్ల క్రితం జాతీయ స్థాయిలో అవార్డు అందుకుందన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్యదర్శులకు తడి, పొడిచెత్తలపై అవగాహన కల్పించి ఆ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. యూనిట్లలో తయారు చేసిన వర్మీ కంపోస్టుతో మొక్కల పెంచి వాటిని రైతులు, గ్రామ ప్రజలు సందర్శించేలా చూడాలన్నారు. అనంతరం ఉండూరు వర్మీ కంపోస్టు యూనిట్‌ను కార్యదర్శులు, క్లాప్ మిత్రలు సందర్శించారు. కార్యక్రమానికి సర్పంచ్ పంతాడి ధనలక్ష్మి అధ్యక్షత వహించగా గొల్లప్రోలు ఎంపీడీఓ రవిబాబు, ఈఓ పీఆర్డీ విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి కె.బుల్లియ్యకాపు పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనీ ఎంఎస్ఎన్ రెడ్డి, డీపీఆర్సీ బృందం శిక్షణ ఇచ్చారు.

ట్రిపుల్‌లెట్.. నో హెల్మెట్!



కాకినాడ క్రైం: 'కాజ్ ఆఫ్ యాక్షన్' అందరికీ వర్తిస్తుంది. అది సహేతుకం అయినదై ఉండాలంతే. అదే కారణం నాకైతే ఒప్పు.. నీకైతే తప్పు అంటేనే ఇబ్బంది. నీకేమైనా కొమ్ములున్నాయా అని అడగాలనిపిస్తుంది. అప్పుడు కేసు పెడతానంటే కుదరదు. ఒక నిబంధన పెట్టాక.. దానిని ఫ్రేం చేసినవారు సైతం దానికి బద్ధులే. నో.. నో.. అంటే కుదరదు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే దానికి మినహాయింపు. ఆకతాయితనంగా.. నేను పోలీస్ అనే నిర్లక్ష్యంతో చేస్తే తప్పు. కాకినాడలోని శ్రీనగర్‌లో హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న మహిళా పోలీసులను సాక్షి కెమెరాలో బంధించింది. పైగా ఆ వాహనంపై కాకినాడ జిల్లా పోలీస్ అని రాసి ఉండడం గమనార్హం. ఏమో ఏమౌనో మరి..!